విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



శంషాబాద్: ఆర్బీనగర్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వేదాన్షి ఫౌండేషన్, ఫిరంగి బాల్‌రాజ్ సహకారంతో బ్యాగులు, జామెట్రీ బాక్సులు తదితరుల వస్తువులను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ కౌన్సిలర్ కె.భారతమ్మ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థ చేయూతనివ్వాల్సిన ఎంతో అవసరం ఎంతైనా ఉందన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నేత కొనమొల్ల శ్రీనివాస్, చిల్కమర్రి పరంధాములు, వేదాన్షి సంస్థ ప్రతినిధులు యాదయ్య, సురేష్, మహేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగయ్య పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం


ఉదరన్ బిందాని

శంషాబాద్: వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... మున్సిపాలిటీ పరిధిలోని చిన్నగోల్కొండ వద్ద ఇటుక బట్టీల వద్ద పనిచేసే ఉదరన్ బిందాని(60) ఈ నెల 8న పట్టణంలోని రాళ్లగూడ వద్ద బంధువుతో కలిసి నడుచుకుంటూ వెళుతున్నాడు. ముందుగా వెళ్లిన అతడి బంధువు తిరిగి చూసే సరికి బిందాని కనిపించలేదు. దీంతో ఆయన కోసం పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మధుబన్ కాలనీలో..


లక్ష్మి

మైలార్‌దేవ్‌పల్లి: కుమారుడి దుకాణానికి వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లిన ఓ వృద్ధురాలు అదృశ్యమైంది. మైలార్‌దేవ్‌పల్లి పోలీసుల సమాచారం మేరకు... మధుబన్ కాలనీకి చెందిన చిట్టి లక్ష్మీ(75) ఈ నెల 10వ తేదీన స్థానికంగా ఉన్న కొడుకు అచ్చిరెడ్డికి స్క్రాప్ దుకాణానికి వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లింది. రాత్రైనా ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకుండాపోయింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్స్: 94906 17459, 87125 68230, 93912 79233లలో తెలియజేయాలన్నారు.

విమాన ప్రమాద మృతులకు నివాళి



అత్తాపూర్: అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో అశువులు బాసిన వారికి హైదర్‌గూడ చౌరస్తాలో పలువురు అశ్రునయనాలతో నివాళులర్పించారు. అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ చౌరస్తాలో బీజేపీ నేతలు నివాళులు అర్పించారు. పార్టీ అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు సులిగే వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పార్టీ చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి ముఖ్య అతిథిగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విమాన ప్రమాద మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. జిల్లా సెక్రటరీ కొమురయ్య, నేతలు విజయ్‌కుమార్, కిరణ్‌చారి, నల్లింగ్ రమేష్, జి.రాజు, సోల్కర్‌రెడ్డి, పి.వెంకట్‌రెడ్డి, ఎస్.వాసు, శశికాంత్‌శర్మ, ఉమా, సతీష్, శ్రీను, విజయ్, స్వామి, సాయియాదవ్, శేఖర్‌రెడ్డి, రాము, భరత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష


నిందితుడు కుమార్

రాజేంద్రనగర్: ప్రేమ, పెళ్లి పేరుతో మైనర్ బాలికను మోసగించి లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి రాజేంద్రనగర్ స్పెషల్ పోక్సో కోర్టు న్యాయమూర్తి పి.అంజనేయులు పదేళ్ల జైలు శిక్ష, రూ. 5 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. బాధితురాలికి రూ.3 లక్షల పరిహారం అందించాలని ఆదేశించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 15 ఏళ్ల మైనర్ బాలిక ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతుంది. హమీదుల్లానగర్‌కు చెందిన కావలి కుమార్(25) అనే వ్యక్తి ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ ఉండేవాడు. 2018లో మైనర్ బాలికకు ప్రేమ, పెళ్లి అంటూ దగ్గరయ్యాడు. ఓ దేవాలయంలో తాళి కట్టి పెళ్లి జరిగిందని నమ్మించాడు. ఈ క్రమంలో లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం యాదగిరిగుట్టకు తీసుకెళ్లి అక్కడే రెండు రోజులు ఉన్నాడు. అనంతరం ఆ బాలికను ఇంటి వద్ద వదిలి పారిపోయాడు. బాధిత బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి అంజనేయులు శుక్రవారం పై మేరకు తీర్పునిచ్చారు.

చినుకు పడితే వణుకే!

- చిన్నపాటి వర్షానికే రోడ్లపైనే నిలుస్తున్న నీరు
- కొన్ని ప్రాంతాల్లో రోజుల తరబడి రోడ్లపైనే..
- డ్రైనేజీల్లోకి వరద చేరి పరేషాన్


శాస్త్రిపురం రహదారిపై నిలిచిన వర్షపు నీరు


బస్తీల్లో పరిస్థితి ఇలా...


వర్షపు నీటితో నిండిన మ్యాన్‌హోల్



శాస్త్రిపురం: చిన్నపాటి వర్షం పడితే చాలు రాజేంద్రనగ్ సర్కిల్ పరిధిలోని శాస్త్రిపురం, సులేమాన్‌నగర్ డివిజన్‌ల పరిధిలోని రహదారులన్నీ జలమయం అవుతున్నాయి. వర్షపు నీరు పల్లపు ప్రాంతాలకు సాఫీగా వెళ్లే మార్గం లేనందున రహదారులపైనే మోకాళ్లలోతు వరకు నిలిచిపోతోంది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందుల నడుమే రాకపోకలు సాగిస్తుంటారు. ఒక్కోసారి ప్రమాదాల బారినా పడుతున్నారు.

- వర్షం పడిన రెండు మూడు గంటల అనంతరం కొన్ని ప్రాంతాలలో నీరు డ్రైనేజీలోకి వెళ్తుండంగా... మరికొన్ని ప్రాంతాల్లో రోజుల తరబడి నీరు రహదారులపైనే నిలిచిపోతోంది.
- శాస్త్రిపురం, మీరాలం చెరువు, సులేమాన్‌నగర్, హసన్‌నగర్ ప్రాంతాలలో వర్షం పడితే రోజులు తరబడి నీరు రోడ్లపైనే నిలిచిపోతోంది. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో కొన్ని ప్రాంతాలలో సమస్య తీవ్రత చాలానే ఉంటోంది. వరద వెళ్లే దారిలేక డ్రైనేజీల్లోకి చేరి మ్యాన్ హోళ్లు పొంగి మురుగుతోసహా రహదారులపై పొంగి ప్రవహిస్తూ ఉంటుంది.
- ఆయా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని పలు బస్తీల్లోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా వర్షాకాలంలో ఈ తరహా సమస్యలు నెలకొంటున్నా నివారణ చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం రాజ్యమేలుతుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
- ఇంద్రానగర్‌లో సైతం చాలా ప్రాంతాల్లో వర్షపు నీరు రహదారులపై నిలుస్తుండటంతో పలు సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు ప్రణాళికాబద్ధంగా నీటిని కాలువల్లోకి తరలించే పనులు చేపడితే సమస్య ఉండదంటున్నారు.

సర్కారు బడిలో వర్షపు నీటితో పరేషాన్

మైలార్‌దేవ్‌పల్లి: నేతాజీనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో వర్షపు నీరు ముంచెత్తింది. దీంతో పాఠశాల ఆవరణ బురదమయంగా మారింది. వేసవి సెలవుల అనంతరం ప్రారంభమైన పాఠశాలలో వర్షపు నీటి కారణంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బురద కారణంగా విద్యార్థుల ఆరోగ్య భద్రతకు ముప్పుగా మారుతోందని ప్రధానోపాధ్యాయురాలు మమత, ఉపాధ్యాయులు మహేశ్వర్, లక్ష్మీ, యాదమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలం ప్రారంభంలోనే ఈ సమస్య తలెత్తడం మరింత ఆందోళన కలిగిస్తున్నదన్నారు. దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు.


నేతాజీనగర్ పాఠశాలలో నిలిచిన వర్షపు నీరు

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం


సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని సత్వర పరిష్కార మార్గాలు చూపుతున్నామని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బంజారా కాలనీలో వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ప్రధానంగా డ్రైనేజీ, రోడ్ల సమస్యను స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అక్కడే ఉన్న అధికారులకు సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ప్రధానంగా భూగర్భ డ్రైనేజీ లైన్ లేకపోవడం, మట్టి రోడ్లతో వరద నీటితో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. లోతట్టు ప్రాంతం కావడంలో నీరు ఇళ్లల్లోకి చేరుతోందన్నారు. వరద సాఫీగా పల్లపు ప్రాంతాలకు వెళ్లేలా ప్రత్యేక పైప్‌లైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు సూచించారు. వాటర్ బోర్డు డీజీఎం రేణుక, సూపర్‌వైజర్ ప్రసాద్, జీహెచ్ఎంసీ ఏఈ నర్సింహమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, సీనియర్ నాయకులు బుచ్చిరెడ్డి, చందునాయక్, ఎల్‌పీ రెడ్డి, తలారి చిన్న, మన్మోహన్‌రెడ్డి, శ్రీకాంత్, శంకర్, మధుసూదన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, జీహెచ్ఎంసీ సిబ్బంది శేఖర్, రాకేష్ పాల్గొన్నారు.

సందడిగా సామూహిక అక్షరాభ్యాసం


అత్తాపూర్ జెడ్‌పీ హైస్కూల్‌లో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈవో శంకర్‌రాథోడ్

అత్తాపూర్: ఆచార్య కొత్తపల్లి జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా పలు పాఠశాలల్లో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం తాను ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి కేశవత్ శంకర్‌నాయక్, హైదర్‌గూడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మలజ్యోతి, అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యారాలు స్వరూపారాణి అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంపొందించేందుకు ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్మికులు, కర్షకుల పిల్లలు మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు తీసుకుంటున్నారని బడికి వచ్చిన పిల్లలందరినీ ఆదర్శ విద్యార్థులుగా తీర్చిదిద్దుతామన్నారు. పనికి వెళుతూ పాఠశాలల్లో విద్యార్థులను తమకు అప్పగించి వెళ్లండని ఉపాధ్యాయులుగా మీ పిల్లలను ప్రయోజకులుగా చేసి చూపిస్తామని తల్లిదండ్రులకు హామీ ఇస్తున్నారు.

గ్రామాల్లో ‘అంగన్‌వాడీ బడిబాట’


అంగన్‌వాడీ చిన్నారులతో కార్యకర్తలు

శంషాబాద్ రూరల్: పెద్దషాపూర్‌తండా, కొత్తతండాలో శుక్రవారం అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిచెన్ గార్డెన్ నిర్వహణ, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. రెండున్నర ఏళ్ల చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్ఞానేశ్వరి సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చదువు పూర్తి చేసుకున్న చిన్నారులకు గ్రాడ్యుయేషన్ కార్యక్రమాన్ని నిర్వహించి తల్లిదండ్రులను సన్మానించారు. కొత్తగా చేరిన చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ఐదేళ్లు నిండిన వారిని స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు అనురాధ, జ్యోతి, మమత, పంచాయతీ కార్యదర్శి యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని 12 స్కూల్ బస్సులు సీజ్

బండ్లగూడ: స్కూల్, కాలేజీలు ప్రారంభం కావడంతో ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా తిరుగుతున్న స్కూల్ బస్సులపై రెండో రోజు కూడా రవాణా శాఖ అధికారులు మెరుపు దాడులు చేస్తున్నారు. పిల్లలు పాఠశాలకు వెళ్లడం ఎంత ముఖ్యమో తిరిగి ఇంటికి క్షేమంగా చేరడం కూడా అంతే ప్రధానం. గతంలో జరిగిన పలు ప్రమాదకర సంఘటనలను పరిగణంలోకి తీసుకొని ముమ్మర తనిఖీలు చేపట్టారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిలోని టీప్‌ఖాన్‌పూల్ బ్రిడ్జి సమీపంలో శుక్రవారం ప్రతి స్కూల్ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి అనుమతులకు విరుద్ధంగా తిరుగుతున్న 12 స్కూల్ బస్సులను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆర్టీఏ అధికారులు మాట్లాడుతూ... విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని నిబంధనలను కఠినతరంగా చేస్తామన్నారు. అప్రమత్తంగా ఉండాల్సిన కొన్ని పాఠశాల యాజమాన్యాలు మాత్రం స్కూల్ బస్సుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ రెన్యువల్ కోసం వచ్చిన బస్సులను పరిశీలించి అది రోడ్డుపై నడిచేందుకు అనుకూలంగా ఉందా లేదా అనేది పరిశీలన తరువాతే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తున్నామన్నారు. ఫిట్‌నెస్ లేకుండా తనిఖీల్లో పట్టుబడితే జరిమానా విధించడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌లు కిరణ్‌కుమార్‌రెడ్డి, సునితారెడ్డి, నవీన్, కృష్ణవేణి సిబ్బంది వెంకట్, శివకుమార్, నాగవర్ధన్, బాల్‌రాజ్ చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

జీఎంఆర్‌వీఎఫ్‌లో ఉపాధి శిక్షణ కోర్సులు

శంషాబాద్: నిరుద్యోగ యువత కోసం శంషాబాద్ విమానాశ్రయం ప్రాంగణంలోని జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్‌లో ఉపాధి శిక్షణ కోర్సులకు సంబంధించి కొత్త బ్యాచ్ ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 18 నుంచి 28 లోపు వయసుండి, పదో తరగతి ఉత్తీర్ణత లేదా ఫెయిల్ అయి దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారు దరఖాస్తు చేసుకోడానికి అర్హులు. గెస్ట్ సర్వీస్ అసోసియేట్, ఆటోమొబైల్ రిపైర్, ఎక్సావేటర్ ఆపరేటర్, డ్రైవాల్స్, ఫాల్‌సీలింగ్, వెల్డింగ్, ఫ్యాబ్రికేషన్ టెక్నీషియన్ కోర్సులకు సంబంధించి మూడు నెలల శిక్షణ ఉంటుందన్నారు. అభ్యర్థులకు ఉచిత భోజన, వసతి సదుపాయాలున్నాయి. ఔత్సాహికులు ఈ నెల 20వ తేదీ లోపు ఫోన్స్: 99129 73086, 89858 00102లలో సంప్రదించాలన్నారు.

పండెన్‌వాగు రూపురేఖలు మారుస్తాం


పండెన్‌వాగును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ తదితరులు

మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని అనేక కాలనీల ద్వారా ప్రవహిస్తూ దుర్గంధం, దోమల సమస్యకు నిలయంగా ఉన్న పండెన్‌వాగు రూపురేఖలను మార్చే పనులను త్వరలోనే చేపడుతున్నామని మణికొండ మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన ఈవీవీ కాలనీలోని నాలాలో పేరుకుపోయిన చెత్తను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వచ్చే నెలలో పండెన్‌వాగు అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. వచ్చే ఏడాది వర్షాకాలంలోపు పూర్తి చేస్తామన్నారు. దాంతో డ్రైనేజీ ఎక్కడా నాలాలో కలవదని, దాంతో వరద నీరు మాత్రమే నాలాలో ప్రవహించి నెక్నాంపూర్ చెరువులోకి చేరుతుందన్నారు. మురుగునీరు అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ ద్వారా మూసీకి చేరుతుందన్నారు. అంత వరకు మురుగు వాసన రాకుండా ఉండాలని నాలాను శుభ్రం చేస్తున్నామన్నారు. ఈవీవీ కాలనీ, స్పెక్ట్రం విల్లాల వద్ద సైతం క్లీనింగ్ చేయిస్తామన్నారు. అంతకు ముందు ది సిటిజన్ కౌన్సిల్ నాయకులు పూడుకు పోయిన నాలాను తెరచి వర్షపు నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరడంతో ఆ నాలాను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర కాలనీలో రోడ్లు, వీధి దీపాలు ఏర్పాటు చేసి తమ దైనందిన సమస్యను తీర్చాలని కాలనీవాసులు కమిషనర్‌ను కలిసి కోరారు. దాంతో ఆయన రాబోయే రోజుల్లో టెండర్‌లు పిలిచి అన్ని పనులను చేస్తామని హామీ ఇచ్చారు. ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వంశీ, కోశాధికారి రవీందర్ రెడ్డి, మున్సిపల్ డీఈ శివసాయి, ఏఈ సంజయ్, ది సిటిజన్ కౌన్సిల్ కార్యదర్శి షేక్ ఆరిఫ్ పాల్గొన్నారు.


వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు


అవగాహన ర్యాలీలో పాల్గొన్న అధికారులు

మణికొండ: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో రోడ్లు, ఖాళీ స్థలాలు, గుంతల్లో వర్షపు నీరు నిలువ ఉండకుండా చూస్తున్నామని, ప్రజలు కూడా ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు, ఈగలు వృద్ధి చెంది వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ కేంద్రంలో వైద్య, మున్సిపల్ శానిటేషన్, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందితో కలిసి డెంగీ, మలేరియా వ్యాధుల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాలాలు, బావులలో ఆయిల్‌బాల్స్ వేశారు. ఇళ్లలోనే సంప్‌లు, మోరీలలో టెమోపాస్ కెమికల్ స్ప్రే చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... వర్షాకాలంలో రోగాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ మేనేజర్ నాగేంద్రబాబు, డీఈ నరేష్‌కుమార్, ఏఈ శ్రీనివాస్, ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీధర్, మున్సిపల్ సిబ్బంది, ఆశా వర్కర్‌లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

చిరువ్యాపారుల ‘డబ్బాల’ తొలగింపు

ఉపాధి కోల్పోయామంటూ చిరు వ్యాపారుల ఆందోళన


సాతంరాయిలో డబ్బాలను తొలగిస్తున్న దృశ్యం


ఆందోళన చేస్తున్న చిరువ్యాపారులు

శంషాబాద్ పట్టణంలోని సాతంరాయిలోని చిరువ్యాపారులు తమ ఉపాధి కోసం వ్యాపారం చేసుకునేందుకు ఏర్పాటు చేసుకున్న డబ్బాలను మున్సిపల్ అధికారులు తొలగించారు. రహదారి పక్కన ఖాళీ స్థలంలో చిన్న చిన్న డబ్బాలు వేసుకుని కిరాణా కొట్టు, ఇస్త్రీ బండి, టిఫిన్ సెంటర్ లాంటివి నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయా డబ్బాలను శుక్రవారం మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. జాతీయ రహదారికి రెండు కిలో మీటర్ల లోపల ఉండే ఈ రహదారిలో పెద్దగా వాహనాల రాకపోకలు లేకున్నా డబ్బాలను తొలగించాలను అధికారులు తీసుకున్న నిర్ణయంపై కాలనీవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమీపంలోనే ఉన్న ఓ గేటెడ్ కమ్యూనిటీలోని బడాబాబులు ఇచ్చిన ఫిర్యాదుతోనే తమ ఉపాధిపై మన్నుపోశారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శంషాబాద్ పట్టణంలో నడిరోడ్డుపై డబ్బాలు ఏర్పాటు చేసి వాణిజ్య కేంద్రాలు నడిపిస్తున్న వారిపై ఎన్ని ఫిర్యాదులున్నా పట్టించుకోని అధికారులు గరీబోళ్ల డబ్బాలపై ప్రతాపం చూపడంపై మాజీ ఉపసర్పంచ్ భవానీమల్లేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బాలు ఏర్పాటు చేసుకున్న వాళ్లంతా గిరిజనులు, దళితులే అన్నారు. పట్టణ నడిబొడ్డున చర్యలు తీసుకొని అధికారులు ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు లేని బస్తీలో వచ్చి చర్యలు తీసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు మాత్రం రహదారి పక్కన ఉన్న కారణంగా తొలగించినట్లు చెప్పుకొచ్చారు.

డ్రైనేజీల నిర్వహణకు ప్రత్యేక చర్యలు


సెయింట్ మైఖేల్ కాలనీలలో అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: వర్షాకాలంలో డ్రైనేజీలు నిండుకోకుండా తరచూ శుభ్రం చేయిస్తున్నామని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్ చంద్ర అన్నారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ ఆదేశాల మేరకు 100 రోజుల ప్రణాళికలో భాగంగా 19వ డివిజన్ సెయింట్ మైఖేల్ కాలనీలో తడి, పొడి, హానికర చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. 10వ డివిజన్‌లోని బిలాల్ కాలనీలో అండర్ డ్రైనేజీని శుభ్రం చేసే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... ప్రజలు డ్రైనేజీల్లో చెత్తాచెదారాలు, వ్యర్థాలు వేయరాదని సూచించారు. వీటి కారణంగానే డ్రైనేజీలు బ్లాక్ అయి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుందన్నారు. దీని కారణంగా ప్రజలకు అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. వెంకట్‌రెడ్డి, శానిటరీ జవాన్లు, శ్రీధర్, తౌఫిక్, రాము తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వసతులు కల్పిస్తాం

మున్సిపల్ మాజీ ప్రజాప్రతినిధులు


పుప్పాలగూడ స్కూల్‌కు కంప్యూటర్, ప్రింటర్‌లను అందజేస్తున్న మాజీ చైర్మన్ నరేందర్ ముదిరాజ్

మణికొండ: పేద విద్యార్థులు చదువుకుంటున్న ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన వసతులను కల్పించేందుకు తమ వంతు కృషి చేస్తామని మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ కె. నరేందర్ ముదిరాజ్, వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, నార్సింగి మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ విజయ్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం పుప్పాలగూడ ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన కంప్యూటర్, ప్రింటర్‌లను కాంగ్రెస్ నాయకులు జితేందర్, కిరణ్‌కుమార్‌లు తమ సొంత డబ్బుతో సమకూర్చి మాజీ చైర్మన్ చేతుల మీదుగా అందజేశారు. మణికొండ ప్రాథమిక, కోకాపేట ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పాటు చేసిన అక్షరాభ్యాస కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గతంలో మున్సిపాలిటీలతో పాటు ఐటీ సంస్థలు, సేవా సంస్థల ద్వారా అన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించామన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని వసతులు సమకూరుస్తామన్నారు. మాజీ కౌన్సిలర్‌లు కె.రామకృష్ణారెడ్డి, జి.శివారెడ్డి, పురుషోత్తం, కె.లక్ష్మీనారాయణ, నాయకులు యాలాల నరేష్, బి.ముత్యాలు, రాజు, బి.శ్రీరాములు, ఎ.కుమార్, బి.రవికాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కోకాపేటలో అక్షరాభ్యాసం చేయించిన మాజీ వైస్ చైర్మన్ విజయ్‌బాబు


మణికొండలో అక్షరాభ్యాసం చేయించిన మాజీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి